క్లుప్తంగా

21న ఓలేటమ్మ నెల సంబరం



ఓలేరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఓలేరు గ్రామంలో వేంచేసి యున్న శ్రీ ఓలేటమ్మ అమ్మవారి మహోత్సవాలలో భాగంగా ఈ నెల 21న సంబరం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి గ్రామస్తులు మొక్కుబడులు చెల్లించుకుని పొంగళ్లు సమర్పిస్తారు. పూజా కార్యక్రమాలు, సంబరాల ను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకుడు బేతపూడి రజనీకాంత్ కృషి చేస్తున్నారు.

ఐలవరంలో ఇంటింటి ధర్మ ప్రచారం



ఐలవరం(భట్టిప్రోలు): సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) నిర్వహిస్తున్న ఇంటింటి ధర్మ ప్రచార కార్యక్రమం సోమవారం భట్టిప్రోలు మండలం ఐలవరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. స్టిక్కర్లు అంటించి హిందూ ధర్మం గొప్పతనాన్ని తెలియజేస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి 25 వరకు పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సహ కన్వీనర్ వి.కోటేశ్వరరావు, గ్రామ కన్వీనర్ ఎం. రంగారావు, నగర సంకీర్తన సంఘం కన్వీనర్ కేబీవీ రమణ, జి.జగన్ మోహన్‌రావు, ధర్మప్రచారక్ చింతల మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక



బాపట్ల: భావపురి ఫొటో గ్రాఫర్స్ ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఆదివారం టౌన్ హాలులో జరిగిన సమావేశంలో ఏర్పాటు చేశారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా వాహిని ప్రసాద్, పి.వి.ఎస్.నాగరాజు, అధ్యక్షులుగా కె.సిద్ధార్థరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఆదిశేషు, కార్యదర్శిగా ఎస్.కె.జాని, సహాయ కార్యదర్శిగా డి.నాగేశ్వరరావు, కోశాధికారిగా ఎస్.శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. అసోసియేషన్ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ఫొటో గ్రాఫర్స్‌ను సభ్యులుగా చేర్చుకుని వారి సంక్షేమానికి కృషి చేస్తామని గౌరవ అధ్యక్షులు వాహిని ప్రసాద్ తెలిపారు.

ఐదు ట్రాక్టర్లు సీజ్

కొల్లూరు : ఇసుక, బుసక అక్రమ రవాణా చేస్తున్న ఐదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు కొల్లూరు ఎస్ఐ రవీంద్రరెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి మండలంలోని చిలుమూరు, పెసర్లంక ప్రాంతాల నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆదివారం కొల్లూరు సమీపంలోని నక్కపాయ ప్రాంతంలో అనుమతులు లేకుండా బుసక అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొన్నారు. ఐదు ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వృద్ధులకు అన్నదానం, పండ్లు పంపిణీ



తెనాలిఅర్బన్: శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యులు బొల్లు మల్లికార్జునరావు వర్థంతిని పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గాంధీనగర్ షిరిడీ సాయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు సోమవారం అన్నదానం చేశారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా కేంద్రం నిర్వాహకులు ముద్దాబత్తుని రమణయ్య, బొల్లు సుబ్బమ్మ, బొల్లు సురేష్‌బాబు, అనూష, ఆశ్రమ నిర్వాహకులు సత్యనారాయణ, సునీత పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

తెనాలిరూరల్: వివాహిత అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చినరావూరుకు చెందిన 48 ఏళ్ల బత్తుల శివపార్వతి ఈ నెల 12న రాత్రి ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం ప్రయత్నించినా లాభం లేకపోవడంతో భర్త శివప్రసాద్ పోలీసులను ఆశ్రయించాడు. వన్‌టౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్



వేమూరు మసీదులో ప్రార్థనలు నిర్వహించిన ముస్లింలు



కొల్లూరులో ఈద్గా వద్ద ప్రార్థనలు

రేపల్లె రూరల్: త్యాగానికి, బలి దానానికి ప్రతీకగా నిలిచే బక్రీదు పండుగను నియోజకవర్గంలో ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో సోమవారం నిర్వహించుకున్నారు. పండుగను పురస్కరించుకుని రేపల్లె పట్టణ, మండలంలోని వివిధ గ్రామాలలో ఈద్గాలను సుందరంగా తీర్చిదిద్దారు. వేకువ జామునే ముస్లిం సోదరులు ఈద్గాలకు చేరుకుని అల్లాకు ప్రత్యేక నమాజులు చేశారు. బక్రీదు పర్వదిన విశిష్టతను ఇమామ్‌లు, మౌజన్లు నమాజుకు హాజరైన ముస్లింలకు వివరించారు. పండుగ రోజున ముస్లింలు ఖుర్బానీ విధిగా ఆచరించాలని, దీనిలో భాగంగా ఆహార పదార్థాలను మూడు భాగాలుగా విభజించి పేదలకు ఒక భాగం, బంధువులకు మరోభాగం అందించిన తరువాతనే మిగిలిన భాగాన్ని తాము స్వీకరించాలన్నారు. తాము సంపాదించిన దానిలో కొంత భాగాన్ని పేదలకు త్యాగం చేయాలన్నారు.



రేపలెలో బక్రీద్ విశిష్టతను తెలియజేస్తున్న ముస్లిం మత పెద్ద



భట్టిప్రోలులో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

కొల్లూరులో బక్రీద్ వేడుకలు

కొల్లూరు : బక్రీద్ పర్వదిన వేడుకలను ముస్లిం సోదరులు కొల్లూరులో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. సోమవారం ఉదయం క్రాప రోడ్డులోని ఈద్గా వద్దకు చేరుకొని మత పెద్దల సూచనలను అనుసరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆత్మీయ ఆలింగనాలతో బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. త్యాగానికి ప్రతీకగా నిర్వహించే బక్రీద్ పండుగ సందర్భంగా పేదలకు దానాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వంటకాలతో పండుగను నిర్వహించుకున్నారు. మత సామరస్యానికి ప్రతీకగా హిందూ, ముస్లింలు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఘనంగా బక్రీద్ వేడుకలు

భట్టిప్రోలు: బక్రీద్ పండుగను సోమవారం భట్టిప్రోలు మండలంలోని ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని వేమవరం, పల్లెకోన, వెల్లటూరు, అద్దేపల్లి, భట్టిప్రోలులోని ఈద్గాలు, మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు బక్రీద్ ప్రాశస్త్యాన్ని వివరించారు. ప్రేమ తత్వం, క్షమా గుణాన్ని అందరూ అలవరచుకోవాలని పేర్కొన్నారు. అందరితో మర్యాదగా మెలగాలని సూచించారు. మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈద్గాల వద్ద ఆధ్యాత్మిక వాతావరణం కనపడింది. పేదలకు తమకు తోచిన సహాయం చేశారు.

ఘనంగా బక్రీద్ ప్రార్థనలు

కర్లపాలెం: బక్రీదు పండుగను ముస్లిం సోదరులు ఆదివారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. త్యాగానికి ప్రతీకగా నిలిచేదే బక్రీద్ పండుగ అని ముస్లిం మతపెద్దలు తెలిపారు. మండలంలోని పాత ఇస్లాంపేట, కొత్త ఇస్లాంపేట, నాగరాజుపాలెం, నల్ల మోతువారిపాలెం, పేరలి, గణపవరం గ్రామాలలోని మసీదులు, ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు నమాజు చేశారు. పండుగ సందర్భంగా ముస్లింలు నూతన వస్త్రాలను ధరించి ఈద్గా వద్దకు వచ్చి భక్తితో అల్లాకు ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

వేమూరు: త్యాగానికి ప్రతి రూపం బక్రీద్ పండగని ముస్లిం మత పెద్దలు తెలిపారు. ముస్లిం పర్వ దినమైన బక్రీద్ పండగను సోమవారం ఘనంగా నిర్వహించారు. కొంత మంది ముస్లింలు ఈద్గా వద్దకు వెళ్లి ప్రార్థనలు నిర్వహించారు. మరికొంత మంది మసీదుల్లో ప్రార్థనలు నిర్వహించారు. వేమూరు నియోజక వర్గంలోని జంపని గ్రామంలో ముస్లింలు ఈద్గా వద్దకు వెళ్లి ప్రార్థనలు నిర్వహించారు. అమర్తలూరు మండలం కేంద్రంలోని ముస్లింలు ఈద్గా వద్ద ప్రార్థనలు నిర్వహించారు. చుండూరు మండలంలోని యడ్లపల్లి గ్రామంలో ముస్లింలు ఈద్గా వద్ద ప్రార్థనలు నిర్వహించారు.

రెవెన్యూ మంత్రి అనగానికి ఘన స్వాగతం



మంత్రి అనగానికి స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

రేపల్లె రూరల్: రాష్ట్ర క్యాబినెట్‌లో స్థానం పొంది రెవిన్యూ శాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనగాని సత్యప్రసాద్ నియోజకవర్గానికి సోమవారం తొలిసారిగా విచ్చేయటంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు మండలంలోని పెనుమూడి గ్రామం వద్ద ఘనంగా స్వాగతం పలికారు. ద్విచక్ర వాహనాలు, కార్లతో ర్యాలీగా వెళ్లి స్వాగతం చెప్పారు. పెనుమూడి నుంచి రేపల్లె ఓల్డ్‌టౌన్, రింగురోడ్డు సెంటరు, నెహ్రూ బొమ్మ సెంటరు, పద్మావతి థియేటర్ సెంటరు మీదగా బస్టాండ్ సెంటరుకు చేరుకుని అక్కడి నుంచి టీడీపీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో పలువురు నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు అనగానిని కలిసి పుష్ప గుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

అక్కివారిపాలెంలో కొనసాగుతున్న వైద్య శిబిరం



వైద్య శిబిరంలో సిబ్బంది

అక్కివారిపాలెం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని అక్కివారిపాలెంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో డయేరియా తగ్గుముఖం పట్టినప్పటికీ శిబిరం శుక్రవారం వరకు కొనసాగించనున్నట్లు వెల్లటూరు పీహెచ్‌సీ వైద్యురాలు చావలి రామలక్ష్మి తెలిపారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి ప్రతి ఒక్కరిని పలకరించారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద నిర్వహించిన ఈ శిబిరంలో వెల్లటూరు పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవో కేకే నాగేశ్వరరావు, ఎంపీహెచ్ఎస్ శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్లు శివరామకృష్ణ, శ్రీనివాసరావు, సచివాలయ ఏఎన్ఎం వి.లీలారాణి, ఎంఎల్‌హెచ్‌పీ ఆశాజ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దింటమ్మ తిరునాళ్ల



పూజలందుకున్న పెద్దింటమ్మ



విద్యుత్ ప్రభల వెలుగులు

పోటెత్తిన భక్తులు

నల్లమోతువారిపాలెం(కర్లపాలెం): కోరిన కోర్కెలు తీర్చే బంగారుతల్లి, గ్రామదేవత శ్రీ పెద్దింటమ్మ అమ్మవారి తిరునాళ్ల ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. గ్రామంలో తిరునాళ్ల సందర్భంగా గత ఐదు రోజుల నుంచి అమ్మవారి కొలుపులు జరిగాయి. అమ్మవారి ఘటాన్ని మేళ తాళాలు, మంగళ వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం ఉదయం గ్రామంలోని మహిళలు, దూరం నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు చేసి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. రాత్రికి తిరునాళ్ల సందర్భంగా గ్రామస్తులు అమ్మవారి ఆలయం వద్ద సుమారు 80 నుంచి 100 అడుగుల ఎత్తులో ఉన్న నాలుగు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. ప్రభల వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. తిరునాళ్ల సందర్భంగా వివిధ గ్రామాల నుంచి అమ్మవారి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. మహిళలు, చిన్నారులు గుడిచుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కొబ్బరికాయలు కొట్టి కానుకలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు పెద్దింటమ్మను దర్శించుకుని పూజలు చేశారు. తిరునాళ్ల సందర్భంగా అమ్మవారి ఆలయం వద్ద విద్యుత్తు ప్రభల వెలుగుల మధ్య భక్తులతో సందడి నెలకొంది.

విద్యార్థులకు ఉపకార వేతనాలు



ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

తెనాలి: ప్రతిభను ప్రోత్సహించే విధంగా ప్రతి ఏటా విద్యార్థులకు ఉపకార వేతనాలతో తోడ్పాటు నందిస్తున్న తెనాలి చిన్మయ మిషన్ సేవలు అభినందనీయమని పట్టణానికి చెందిన సంఘ సేవకురాలు, డీ3 శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారద అన్నారు. తెనాలి చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఉపకార వేతనాలను సోమవారం స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని కుమార్ పంప్స్ సెమినార్ హాలులో అందజేశారు. డాక్టర్ శారద ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివిధ తరగతుల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులైన 14 మంది విద్యార్థులకు చిన్మయ మిషన్ ద్వారా ఉపకార వేతనాలను అందజేశారు. ప్రతి ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న సంస్థ సేవలను డాక్టర్ శారద కొనియాడారు. డాక్టర్ శారదను చిన్మయ ప్రతినిధులు శాలువాతో సత్కరించారు. పేదరికం ప్రతిభకు అడ్డుకాకూడదన్నది తమ ఆలోచనగా చిన్మయ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత లక్ష్యాలు సాధించాలని సూచించారు. కుమార్ పంప్స్ ఎండీ కొత్త సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. అలపర్తి నాగరత్తమ్మ, రమాదేవి, మాధవి, రిటైర్డ్ ఎంఈవో పుష్పకుమారి, కొత్త కృష్ణకుమార్, హరికుమార్, శేషుకుమార్, శ్రీనివాస కుమార్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

శోభాయాత్ర కరపత్రాల ఆవిష్కరణ

తెనాలిరూరల్: ఈ నెల 23న తెనాలిలో నిర్వహిస్తున్న శివాజీ శోభాయాత్ర బైక్ ర్యాలీ కరపత్రాలను రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ఆవిష్కరించారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయం వద్ద సోమవారం శివాజీ శోభాయాత్ర స్మారక సమితి సభ్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీలో నియోజకవర్గ ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని మంత్రి కోరారు. శివాజీ స్మారక సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు మైలా హరికృష్ణ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ జీవిత చరిత్రను ప్రతి ఒక్కరికీ తెలియాలనే ఆలోచనతో పాటు హిందూ శక్తి సంఘటితంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ శోభాయాత్ర ర్యాలీని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. చెంచుపేట నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. ఆహ్వాన కమిటీ చైర్మన్ చందు రామారావు, ఏపూరి హరిప్రసాద్, హనుమత్ ప్రసాద్, పోలిశెట్టి సాయి, మైలా చిన్న, ఆరాధ్యుల అంకమ్మరావు, మైల బాలకృష్ణ, మణి పాల్గొన్నారు.

తెనాలి రోటరీ క్లబ్‌కు గుర్తింపు



క్లబ్ పొందిన పత్రాలను చూపుతున్న సభ్యులు

తెనాలిరూరల్: తెనాలిలోని 'రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి' వైకుంఠపురంకు పలు విభాగాల్లో ప్రశంసా పత్రాలు వచ్చాయి. క్లబ్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అధ్యక్షుడు పావులూరు రాంబాబు వివరాలు వెల్లడించారు. క్లబ్‌లో నూతన సభ్యులను చేర్పించడం, మెటర్నిటీ, చైల్డ్ హెల్త్, విద్య, అక్షరాస్యత వంటి అనేక కార్యక్రమాలకు భద్రాచలంలో ఆదివారం జరిగిన రోటరీ క్లబ్‌ల సమావేశంలో ప్రశంసా పత్రాలను అందించినట్టు తెలిపారు. అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ, ఈదర వెంకట పూర్ణచంద్, అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల కాలం..

- వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం
- పరిశుభ్రత, దోమల నివారణే రక్షణ
- నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు పాటించాలి
- జ్వరం వచ్చిన వెంటనే రక్త పరీక్షలు తప్పనిసరి
- పీహెచ్‌సీలో అందుబాటులో వైద్య సేవలు



మురుగు కాలువలో ఉన్న దోమలు

తాడేపల్లిరూరల్: నైరుతి రుతుపవనాల రాకతో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వ్యాధుల సీజన్ మొదలైంది. దోమల దండయాత్రతో పాటు మంచి నీరు కలుషితమవుతోంది. దీంతో అనేక వ్యాధులు ప్రబలుతాయి. ముఖ్యంగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్, కామెర్లు, డయేరియా, మెదడువాపు లాంటి అనేక వ్యాధులు ఇబ్బంది పెడతాయి. ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించకపోతే వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్రంలో నిన్నటి వరకు అధికారంలో ఉన్న వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి చేసింది. డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది కొరత లేకుండా చేయడమే కాకుండా నాణ్యమైన ఔషధాలు, రక్త పరీక్షలకు ఆధునిక లేబొరేటరీలను ఏర్పాటు చేసింది. దీంతో సీజనల్ వ్యాధులను నివారించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవడానికి అధికారులకు వెసులుబాటు లభించింది.

ఒక్కో పీహెచ్‌సీకి ఇద్దరేసి డాక్టర్లు

మంగళగిరి రూరల్ పరిధిలోని ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించేందుకు నియోజకవర్గంలో మొత్తం 11 పీహెచ్‌సీలు ఉన్నాయి. ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరేసి డాక్టర్లు ఉన్నారు. ఒక డాక్టరుతో సహా ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక ఫార్మాసిస్టు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, 4వ తరగతి ఉద్యోగి అందుబాటులో ఉన్నారు. సీజనల్ వ్యాధులు మలేరియా, టైఫాయిడ్, డెంగీ, డయేరియా లాంటి అన్ని వ్యాధులకు పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉన్నాయి. ల్యాబ్‌లలో 60 రకాలకు పైగా రక్త పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు.

డెంగీ కేసులు....

నియోజకవర్గంలో డెంగీ, మలేరియా కేసులు కనిపిస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకు మంగళగిరి నియోజకవర్గంలో డెంగీ, మలేరియా కేసులు అక్కడక్కడా నమోదయ్యాయి. వలస కార్మికులు, కూలీలు ఎక్కువగా మలేరియా జ్వరాల బారిన పడుతున్నట్లు మలేరియా శాఖ అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. డెంగీ కేసుల్లో ప్రైవేటు వైద్య శాలలకు అనుబంధంగా నిర్వహిస్తున్న ల్యాబ్‌లు, ప్రైవేటు ల్యాబ్‌లలో చేసే పరీక్షలన్నీ అనుమానాస్పద కేసులుగా వైద్యశాఖ పరిగణిస్తుంది. ర్యాపిడ్ కిట్ ద్వారా చేస్తున్న అలాంటి పరీక్షల్లో పాజిటివ్‌గా వచ్చినప్పటికీ అనుమానిత కేసుగానే పరిగణిస్తారు. ప్రభుత్వ వైద్యశాలల్లో చేసే ఎలిసా పరీక్ష ఫలితాన్నే డెంగీగా నిర్ధారిస్తారు.

దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు ఇవే

సీజనల్ వ్యాధుల్లో రెండు రకాలు ఉంటాయి. ఒకటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు, రెండు మంచినీరు కలుషితం కావడం వల్ల వచ్చే వ్యాధులు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల్లో డెంగీ, మలేరియా, మెదడు వాపు, చికున్ గున్యా, బోధకాలు ముఖ్యమైనవి. మంచి నీరు కలుషితం కావడం వల్ల టైఫాయిడ్, డయేరియా, కామెర్లు ప్రబలుతాయి.

డెంగీ జ్వరం

ఇది ఎడిస్ ఈజిప్ట్ అనే దోమకాటు ద్వారా సోకుతుంది. ఉన్నట్టుండి ఒక్కసారిగా తీవ్రమైన జ్వరం వస్తుంది. నొసట తలపై తల నొప్పి, కంటి లోపల కదలికలు తగ్గుట, కండరాలు, కీళ్ల నొప్పులు ఇబ్బంది పెడతాయి. నోరు ఎండిపోవడం, వాంతి వచ్చినట్లు ఉండడం, చర్మంపై కందినట్లు ఎర్రటి మచ్చలు రావడం కనిపిస్తాయి. ఈ జ్వరంలో కొందరికి ప్లేట్ లెట్లు పడిపోతాయి. ఆందోళన చెందకుండా వెంటనే వైద్య చికిత్స కోసం ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించాలి.

టైఫాయిడ్

ఇది మంచి నీరు, ఆహారం కలుషితం కావడం ద్వారా వస్తుంది. జ్వరం వస్తూ పోతుంది. ఆకలి తగ్గుతుంది. కొంత మందిలో వాంతులు అవుతాయి. 3 రోజుల తర్వాత రక్త పరీక్షల్లో టైఫాయిడ్ పాజిటివ్ వస్తుంది. సొంత వైద్యం చేసుకోకుండా వైద్యశాలలకు వెళ్లి వైద్య చికిత్స చేయించుకోవాలి.

కామెర్లు (హెపటైటిస్)

వర్షాకాలంలో ఎక్కువగా సోకే వ్యాధి పచ్చ కామెర్లు. కలుషితమైన నీరు, ఆహారం, మద్యం అలవాటు ఉన్నవారిలో ఈ వ్యాధి కనిపిస్తుంది. శరీరంలోకి ప్రవేశించిన సూక్ష్మ క్రిములు కాలేయంలోకి ప్రవేశించడంతో కామెర్లు వస్తాయి. కామెర్లు సోకగానే కళ్లు పసుపు పచ్చగా మారుతాయి. వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి తగిన వైద్య చికిత్స పొందాలని వైద్యులు సూచిస్తున్నారు.

డయేరియా

వర్షాకాలంలో వచ్చే వ్యాధుల్లో ప్రధానమైనవి విరేచనాలు. ఇవి కూడా కలుషితమైన ఆహారం, నీరు వల్ల వస్తాయి. విరేచనాలతో పాటుగా వాంతులు కూడా అవుతాయి. శరీరంలోని నీరంతా పోవడం వల్ల మనిషి నీరసపడిపోతాడు. ఒక్కోసారి డీ హైడ్రేషన్‌కు గురవుతారు. విరేచనాలు మొదలైన వెంటనే వీలైనంత త్వరగా సమీపంలోని వైద్యశాలకు వెళ్లాలి. అవసరమైన చికిత్స చేయించుకోవాలి. విరేచనమైన ప్రతిసారి ఎలక్ట్రాల్ తాగాలి. అవసరమైతే సెలైన్లు పెట్టి వైద్య చికిత్స చేయడం జరుగుతుంది.

దోమల నిర్మూలనే లక్ష్యంగా చర్యలు.

దోమలు ప్రధానంగా నీరు నిల్వ ఉన్న చోట పెరుగుతాయి. రోజుల తరబడి నీరు నిల్వ ఉన్న చోట దోమలు గుడ్లు పెడతాయి. అవి లార్వాగా మారతాయి. ఇవి ఇంట్లోని కూలర్లు, వాడి పడేసిన కొబ్బరి బోండాలు, టైర్లు, రుబ్బు రోళ్లు తదితర వాటిలో దోమలు పెరుగుతాయి. దోమల నివారణకు ప్రతి 15 రోజులకోసారి మంచి నీటి ట్యాంకులను శుభ్రం చేయాలి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంటే మట్టితో పూడ్చాలి. వీలుకాని పక్షంలో పెద్ద పెద్ద కుంటల్లో ఆయిల్ బాల్స్ వేస్తారని వైద్యాధికారులు తెలిపారు. డెంగీ, మలేరియా జ్వరాలు కేవలం దోమల ద్వారా మాత్రమే సోకుతాయి. దోమలు పుట్ట కూడదు, దోమలు కుట్ట కూడదు అనే నినాదంతో ముందస్తు జాగ్రత్త చర్యలను సూచిస్తూ వైద్య ఆరోగ్య శాఖ ప్రజల్లో అవగాహన కల్పిస్తోంది. శుభ్రమైన మంచినీరు మాత్రమే తాగాలి. కాచి వడపోసిన నీరు ఎంతో మేలు చేస్తుంది.

శ్రేష్ట ఆస్పత్రిలో గుండె జబ్బులకు ఆధునిక చికిత్స

గుంటూరు మెడికల్: నగరంలోని గుజ్జనగుండ్లలో ఉన్న శ్రేష్ట ఆస్పత్రిలో గుండె జబ్బులకు ఆధునిక పద్ధతిలో ఐవీయూఎస్ విధానం ద్వారా గుండె చికిత్సలు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ గుండెజబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ గొట్టిపాటి నాగార్జున తెలిపారు. ఇటీవల కాలంలో యువకులు ఎక్కువ మంది గుండెజబ్బుల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఎక్కువ మంది గుండె రక్త నాళాల్లో అడ్డంకులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. వీటిని తొలగించడానికి యాంజియోగ్రామ్ ద్వారా స్టంట్లు అమర్చి అడ్డంకులు తొలగిస్తున్నట్లు వెల్లడించారు. ఇంట్రా వస్క్యులర్ అల్ట్రా సౌండ్ (ఐవీయూఎస్) ద్వారా స్టంట్లు అమర్చడం వలన రోగులకు దీర్ఘకాలంలో మళ్లీ రక్త నాళాల్లో పూడిక ఏర్పడడానికి అవకాశాలు తక్కువ అన్నారు. స్టంట్ కూడా సరైన పరిణామంలో తగిన విధంగా కచ్చితంగా అమర్చడం జరుగుతోందని వివరించారు. దీని వలన మెరుగైన ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. చికిత్స తమ ఆసుపత్రిలో నిర్వహిస్తున్నట్లు నాగార్జున వివరించారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్

కర్లపాలెం: అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను సెబ్ ఎస్ఐ గీతిక సీజ్ చేసి కేసు నమోదు చేసిన సంఘటన కర్లపాలెం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ గీతిక తెలిపిన వివరాల మేరకు కర్లపాలెం మండల పరిధిలోని మరకవారిపాలెంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి తమ సిబ్బందితో దాడులు చేపట్టారు. మట్టి తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను గుర్తించి సీజ్ చేసి కేసు నమోదు చేశామని తెలిపారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

తాడికొండ: బాల కార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా కృషి చేయాలని గుడ్ షెపర్డ్ కాన్వెంట్ స్వచ్ఛంద సేవా సంస్థ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు సభ్యులు పేర్కొన్నారు. బాల కార్మిక వ్యతిరేఖ దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం తుళ్లూరు మండలం మందడం గ్రామంలోని ఎస్టీ కాలనీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే వారి స్థితిగతులు తెలుసుకొని, ప్రభుత్వాధికారుల సహకారంతతో పాఠశాలలో చేర్పాలని, దీంతో వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయవచ్చన్నారు.